నీలమ్మ

'ఇదిగో తల్లీ, నీ బంగారు కొండ. ఇక నువ్వు ఏడమన్నా ఏడ్డు. సక్కగా నిద్దరోతాడు' మూడు రోజుల పసికందుని తల్లిపక్కలో పడుకోబెట్టింది.

'ఏమో నీలమ్మా! రాత్రంతా నిద్రలేదు. హడల గొట్టేశాడనుకో. నీ చేతి మహాత్మ్యం చూడాలి...,' అంది పిల్లాడ్ని దగ్గరకు తీసుకుంటూ.

'ఇంక నేనొత్తానమ్మా.'

'కాస్సేపు కూర్చో. అమ్మ కాఫీ తీసుకొస్తుంది.' అంటున్నా వినకుండా ఒక్క అంగలో ఆ గడప దాటేసింది.

'పొద్దెక్కి పోనాది. సంటిబిడ్డ ఏడుత్తుందో... ఏటో! లతమ్మ అసలే బెంబేలెత్తిపోతుంది. తొలి సూలాయె,' వారం క్రితం ప్రసవించిన ఆ తల్లీ బిడ్డలని కళ్లల్లో నింపుకొని ఆ యింట్లో అడుగుపెట్టింది. తొలి కాన్పు పసిపాపను సాకనేరని బాల తెలబోయి కళవళ పడ్డ విశ్వనాథవారి ఊహలా బేలగా నీలమ్మను చూసింది.

'నేననుకున్నా లతమ్మా! ఏడిపించేత్తన్నావా! అయ్యయ్యో..., నిన్నెవలేటన్నారమ్మా! నా పంచదార సిలకా, అమ్మకి నిన్నెత్తుకోడం కూడా సేతకాదు.'

'అందుకేనా, నువ్వు మరీ ఆలస్యం చేశావ్?' బుంగమూతి పెట్టింది లత.

'నేద్తల్లీ! మొన్న పురుడోసుకున్న ఆ సుసీలమ్మ నీలాటి మాలోకమే. ఆ పిల్లాడికన్నీ సేసొచ్చేసరికి యింత పొద్దయిపోనాది. అలిగితే ఎట్టా లతమ్మా? నీ కూతురు పని... ఇదిగో... సిటికెలో నేసీనా?' అంటూ చిటికెలు వేసింది. ఆ పసిబిడ్డ సంరక్షణ కూడా పూర్తిచేసి తల్లి ఒడికందించి తృప్తిగా నిట్టూర్చింది.

చంటి బిడ్డల సంరక్షణే తన జీవితంగా మలచుకొంది నీలమ్మ. ఆ పనిలో ఆమె పొందే మాటలకందని అనుభూతి ఆమె మనసుకే తెలుస్తుంది. నిజానికి అంత సమయాన్ని వెచ్చించి ఇంకే పనిచేసినా చాలా వెనకేసుకోగలిగేది. ఆమెను ఎరిగిన వాళ్లంతా అలానే అంటారు మరి.

'ఇట్టాటి పీకులాట పని ఎట్టుకుంతావేటి, నీకున్న ఓపిక్కి పదిల్లు పనిసేస్కోగలవ్ ' అని ఒకరంటే 'దాం తెలివి తేటలకి ఇల్లకాడ పనులేటి: ఏ ఫేక్టరీలోనో కుదురుకుందంతే ఏలు సంపాదించేద్ది, అని ఇంకొకరు, 'ఔనర్రా, కాని నీలమ్మకి సంటి బిడ్డల్ని సాకట మంటే ఎర్రియిట్టం' అంటూ మరొకరు ముక్తాయింపు యిచ్చేస్తారు. నీలమ్మ నవ్వి ఊరుకొంటుంది.

'నిజమే..., యీలంతా అంతున్నట్టు తనకి పసోల నేపంటే పేగు మెలిపడేంత పేమ. ఆల ఊసులతోనే తనకి గుండె నిండిపోద్ది. తన కళ్లల్లో ఇప్పుడిప్పుడే బూమ్మీద పడ్డ బుల్లి పేనాలే మెదుల్తారు. ఆల కోసమే తను,' అనుకున్న నీలమ్మ తను చేసేపనిలో పూర్తి సంతృప్తినే పొందగలుగుతుంది. పాతికేళ్ళుగా ఈ పనిలో చెయ్యితిరిగిన నీలమ్మ చంటి బిడ్డల స్థితిగతులు ఇట్టే ఆపోసనం పట్టేసింది. వాళ్లు ఏడుస్తుంటే ఆ బాధ ఏమిటో పసిగట్టి, ఏదో చిన్న చిట్కా వైద్యంతో ఉపశమింపజేస్తుంది.

'ఊరికే బెంగపెట్టుకోకు తల్లీ: కాత్తా పొట్ట నొత్తుంది. కా'సి, ఉగ్గెడతాలే. నువ్వు కడుపు నిండా పాలియ్యి. సెనంలో అది నవ్వి, నిన్ను నవ్విత్తాది. పిల్లోడికి పడిసె వొట్టింది. అందుకే ఊపిరి సరిగ్గాట్టం నేదు. కాసిన్ని వోంపాయిలు, ఎల్లుల్లి రెక్కలు పొగేత్తాను. కాసేపటికి హాయిగా నిద్దరోతాడు.' ఇలా పిల్లలకి సేద తీరుస్తూ తల్లులకు తలలో నాలుకైంది. ఎప్పటికప్పుడు వచ్చే మార్పులు శ్రద్ధగా గమనిస్తూ, వాటికి తన తెలివి జోడించి ఆచరణలో పెడుతుంది.

'ఇదొరుకైతే ఉగ్గంటూ ఆయుదం పోసేవోలం. మొకం కందగడ్డలా సేసి, మింగటానికి పేసీ ఎట్టీవోరు ఎర్రి నాగమ్మలు. మరిప్పుడో! గైపోటరు పడతన్నాం కదా. ఎంచక్కా నవ్వుతూ తాగేత్తున్నాడు!' ఇలా ఎప్పుడూ పసిపిల్లల ముచ్చట్లే.

తన గురించి తనెప్పుడూ ఆలోచించుకోదు. ఎప్పుడో మోడువారిన తన బ్రతుకుకు లాలపోసి, లాలన చేసే పసికూనలే చిగుళ్లు. బరువు బ్రతుకు తలపోసి మనస్సు భారం పెంచుకోవటం నీలమ్మకు సుతరాం యిష్టం లేదు. అందుకే పరమాత్ముని ప్రతి రూపాలైన పసిబిడ్డలతో తన మనుగడ మధురం చేసుకొంది. విచిత్రమైన మాతృత్వపు అనుభూతిని పొందుతూ దాదిగా మారింది.

నీలమ్మ తండ్రి - మల్లన్న - తోటమాలి. పూలతో, లతలతో, పక్షులతో బంధాన్ని పెంచుతూ అపర శకుంతలలా పెంచేడు - భార్య వెళ్లిపోతూ తనకు మిగిల్చిన ఒకే ఒక్క కూతుర్ని. ఆ శకుంతలకు తల్లి కావటం శాపంగాపరిణమిస్తే, నీలమ్మకు మాతృత్వం సిద్ధించకపోవటం ఘోర శాపమైంది. తను యావజ్జీవితం శ్రమించి, కూతురు భవిష్యత్తు కోసం కూడబెట్టిన సంపదతో ముచ్చటగా పెళ్ళిచేసి కాపురానికి పంపేడు నీలమ్మను. అల్లుడెంతో మంచివాడనీ, తన బిడ్డను ప్రేమగా చూసుకొంటున్నాడనీ పొంగిపోయే వాడతను. కానీ, ఆ ప్రేమ ఆవిరైపోటానికీ, ఆ మంచితనం మంచులా కరిగిపోటానికీ ఎంతోకాలం పట్టలేదు. కాపురానికొచ్చి ఐదేళ్ళు గడిచినా నీలమ్మ బిడ్డను కనలేదనే వంకతో గొడ్రాలని ముద్రవేసి తరిమేశాడా పురుషోత్తముడు. పుట్టెడు దుఃఖంతో పుట్టింటికి చేరే కూతురి బాధ ఎక్కడ చూడవలసొస్తుందో అన్నట్టు అంతకు కొద్ది నెలల ముందే మల్లన్న ప్రాణాలు అనంత వాయువులలో కలిసిపోయాయి. తన వాళ్ళంటూ ఎవరూ లేకపోయినా, పుట్టి - పెరిగిన ఊరే కన్నతల్లిలా కడుపులో దాచుకొంటుందన్న ఆశతో నీలమ్మ తన ఒంటరి బ్రతుకును ఆ చిన్న పట్నంలోనే గడపటానికి నిశ్చయించుకుంది. ఆమె నమ్మకం వమ్ము కాలేదు. 'కన్న తల్లే దైవం - ఉన్న వూరే స్వర్గం' అన్నట్టు ఆ వూరి వారంతా నీలమ్మకు

అండదండలుగా నిలిచేరు. కొందరు చల్లని ఓదార్పులతో ఊరట కలిగించేరు. 'నీకేం తక్కువని ఇంతపని చేసేడు. ఆ చలమయ్య అంతు చూస్తాం. నీ కాపురం నిలబెట్టి తీరుతాం. ఎలా ఏలుకోడో చూస్తాం,' అని ఇంకొందరు సవాల్ చేసారు.

'అతగాడి కిట్టంనేక యీ వొంకెట్టి ఒగ్గేసిండు. మీకు బయపడి అద్దన్ను సూత్తానన్నా మనసు లేనోడు, బతికినన్నాలూ తోడు నీడగా వుంతాడని నమ్మకం నాకు నేదు,' వారించింది.

జీవన యాత్ర సాగాలంటే నా అన్నవాళ్లే వుండనక్ఖరలేదు. నలుగురిలో కలసిపోయి, పదిమందితో బ్రతుకు పంచుకోవటమే పరమార్థంగా ఎంచుకొంది నీలమ్మ. పువ్వుల్లాంటి పసిపాపలు ఆమె పెదవులపై నవ్వుల పువ్వులు పూయించేరు. దీపాల్లాంటి చిరుకూనలు ఆ కన్నుల్లో కాంతులు నింపేరు. శిశువుని ఒళ్లో వేసుకొని నలుగుబెట్టి, నీళ్ళుపోసి, సాంబ్రాణి ధూపం వేసి గోరంత సూర్యునిలా మెరుస్తున్న ఆ లేత ముఖం ముద్దాడుతూ పారవశ్యాన్ని పొందుతుంది. సంగీతాన్ని శిశుర్వేత్తి అంటారు. నీలమ్మ పాటకు నిజంగా ఆ శక్తి వుంది.

'ఓ ఒ ఒ ఒ ఓ... హాయీ... లాలీ... జోజో" అంటూ అందుకుందంటే ఏ చిన్నారైనా ఏడుపు మానీవల్సిందే. అంతటి మహాత్మ్యం, మాధుర్యం వున్నాయి, ఆ అమాయకురాలి పాటకి. ఎక్కడో... ఎప్పుడో... విన్న ఏ జానపదాలో వాళ్లని చూస్తూ అలా... అలా... అల్లేసిన జోలలో జాలువారుతూనే వుంటాయానోట. యవ్వన దశలో వున్నప్పుడే పెద్దతనం పైబడ్డట్టు అలా వ్యవహరించ గలిగిన నీలమ్మ కాస్త ముదిమి ఛాయ ముసిరే వేళకు తలపులను దూరంగా వుంచలేకపోయింది. ఇప్పుడే పదే పదే చలమయ్య రూపం కళ్లల్లో మెదుల్తుంది. తెలియని దిగులేదో మనస్సు నావరించింది. తనను విడిచిపెట్టిన కొద్ది రోజులకే చలమయ్య మరో మనువు చేసుకున్నాడనీ, రెండేళ్ళు గడిచేసరికి ఇద్దరు కొడుకులకు తండ్రి అయ్యాడని తెలుసుకున్నా కలత పడలేదు. కన్నీరై కరిగిపోనూ లేదు. అలాటిదిప్పుడు ఏ పాశం పీకుతుందో! మరే బంధం లాగుతోందో! - అని ఆమెకొక కలవరపాటుగా వుంది. మామని తలుచుకొంటే కన్నీరుబికి వస్తోంది. తన మామకేం దరిజాగా కోరిసేసుకున్న మరో ఆలితో, దొరబాబుల్లాటి కొడుకుల్తో సుఖంగా వుండడూ? తనే పిచ్చి మాలోకం. ఇన్నేళ్లూ ఎట్టాగో దొర్లిపోయాయి. ఇప్పుడేద కొత్తున్నాడేటో! మామ తన్ని తలుత్తాడా? ఇకిట్టా దుక్కపడకూడదు. తనూ మర్చిపోవాలి.

'మేమంతా కనకమ్మ జాతరెల్తన్నాం, వత్తావేటే నీలమ్మా?' పక్క గుడిసెలో వున్న పార్వతమ్మ అడిగింది, బయల్దేరింది నీలమ్మ.

అమ్మవారి జాతరలో మనసు కుదుట పడ్డట్టనిపించింది. గుండెనిండా భక్తితో పసుపుకుంకాలు, కొత్తచీర ఆ తల్లి పాదాల ముందుంచి మొక్కుకుంది. కళ్లు మూసుకొని ధ్యానించింది 'తనకే కోరికా లేదు, తల్లి దయవుంటే చాలు' అనుకున్నా, మావ మనసుని వదలడే, 'పెనిమిటి సల్లగా వుండాల: అడ్ని రచ్చించు తల్లీ' అని కోరకుండా వుండలేకపోయింది. తిరిగి వస్తుంటే, ఆమె కంటబడ్డ దృశ్యానికి నిలువెల్లా కంపించింది. తన కళ్లను తనే నమ్మలేకపోయింది.

ఒక్క అంగలో ఆ బిచ్చగాళ్ల ముందుకెళ్లింది. 'ఏటీ! యీ ఆడుక్కున్నోల మద్దె, ఒ లమ్మో!' ఆమె గుండె ఆగినంత పనయింది.

అప్రయత్నంగా 'మావా' అనేసింది. అదిరిపడి చూసిన అతను ఆమెను గుర్తించేడు. 'ఇదేటి మావా! ఇట్టాగైపోనావు?' ఒక కాలు పోగొట్టుకొని అవిటివాడైన తన భర్తని పెనవేసుకొని భోరుమంది.

'సీ... నన్నంటుకోకే'

'అట్టా అనకు మావా! నువ్వంతే నాకు పేనం', ఆమెకు దుఃఖం ఆగటంలేదు.

'నువ్వేడుత్తావేటే? ఏడాల్సింది నానే, నిన్నెల్లగొట్టిన పాపం ఊరికే పోద్దా?'

'పాపం పున్నెం కాదు మావా! ఇట్టాటప్పుడు ఆలీ, పిల్లలు నిన్నెట్టా సూస్కోవాలి, ఆల్లేటైపోనారు? సివరికి నీ బతుకిట్టా సేసేరా' ఏవేవో అడుగుతోంది- ఏడుస్తూ. ఆ నిస్వార్థ ప్రేమను, అంచులు లేని మంచితనాన్ని భరించలేకపోయాడు చలమయ్య.

'ఇట్టాటి నీలినా తను దూరం సేసుకున్నది! పిల్ల గోల్లని కనదేమో అని తన్ని తగిలేశాను, కన్న పిల్లగోల్లు తన బాగోగులు సూత్తన్నారా? ఏలిడేసి ఎదవలుంతప్పుడే తల్లి సచ్చిపోతే, ఏటి తక్కువ సేశానా? పెంచి, కసింతో కసింతో సదువు సెప్పించాను. పైసలు బాగానే సంపాదించుకుంతన్నారు కానీ, తను కుంటోడయ్యే సరికి ఇంటి నుంచి తరిమేశారు'. తన మనసులో మథనపడ్డాడు.

'పలకవేటి మావా! నానంతె ఇంకా నీకిట్టంనేదా?' చలమయ్య ఆలోచనల నుండి తేరుకొని 'ఎర్రి నీలీ! నాను సేసిన అన్నేయానికే కుల్లి కుల్లి ఏడత్తన్నానే. నువ్విట్టా పెద్దమనసుతో పలకరిత్తే నాకు మాటేంవొత్తది?' అంతే. ఆపైన మాటల పని లేకపోయింది. నీలమ్మ పూర్తి ఆసరాతో అతడు నిలబడ్డాడు.

'తను మాలిమి చేసుకున్న పసిబిడ్డల్లాగానే మావని కల్లల్లో ఎట్టుకొని సాకాలి' తన ఇంటికి భర్తతో సహా సాగిపోతున్న నీలమ్మ అనుకొంది.

'తనైతే సేసుకున్న మనువుకి యిలు వియ్యకుండా పెల్లాన్ని యీదిపాలు సేసేడు. ఈదిలో అడుక్కుతింతున్న తనని సేరదీసి ఎదలో దాసుకుంది తన నీలి దేవతే. మొగోడు మోజు తీర్చేసుకొని ఆడదాన్ని ఇసిరి కొట్టినా దొడ్డ మనసుతో ఆల్లెప్పుడూ మొగుల్ని గుండెలో ఎట్టుకొని కొలుసుకుంతారు. మొగోల్లూ ఇట్టాగే ఒకో పేమ, ఒకే మనసు ఎట్టుకొని బతకాలి. అప్పుడిట్టాటి నీలి కతలుండవు.' ఆమె వల్ల పునర్జీవితుడైన చలమయ్య గుడిసెలో ప్రవేశిస్తూ అనుకున్నాడు.

●